క్లుప్తంగా

నేడు రామానుజ జీయర్ స్వామి రాక



తిరువీధిలో స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

సీటీఆర్‌ఐ: లాలాచెరువు వద్ద గల గోవింద క్షేత్రానికి మంగళవారం త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి వస్తున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం నుంచి ఆలయంలో స్వామివారికి పుష్కర బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. అనంతరం గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఆలయ అర్చకుడు శ్రీమన్నారాయణ స్వామి మాట్లాడుతూ ఆలయం నిర్మించి 13 ఏటలోకి అడుగుపెడుతున్న సందర్భంగా స్వామివారికి పుష్కర బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ సత్యవేణి

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సత్యవేణి పిలుపునిచ్చారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి అర్జీలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం 1902కి వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానింగ్ అధికారి జె.సూరజ్ కుమార్, డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఎ.వినూత్న పాల్గొన్నారు.


భగత్ సింగ్ పోరాటం స్ఫూర్తిదాయకం



భగత్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గొందేశి శ్రీనివాసులు రెడ్డి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భగత్ సింగ్ పోరాటం స్ఫూర్తిదాయకమని ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నాయకుడు, గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు గొందేశి శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఐదుబళ్ల మార్కెట్ సెంటర్‌లో సోమవారం భగత్ సింగ్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేశవభట్ల చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు కేశవభట్ల శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్, జిల్లా వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు ముద్దాల అను, వైఎస్సార్ సీపీ నాయకుడు లంక సత్యనారాయణ, సీపీఎం నాయకుడు పాల్గొన్నారు.

ఉప ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులు



రాజమహేంద్రవరం రూరల్: ఏపీ గ్రామ, వార్డు సచివాలయ దివ్యాంగ ఉద్యోగుల సంఘ ఉప ప్రధాన కార్యదర్శిగా బొమ్మూరు గ్రామ సచివాలయం-3 డిజిటల్ అసిస్టెంట్ తన్నీరు రామాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న దివ్యాంగుల ప్రతినిధుల సమావేశం శనివారం విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పేదలకు అన్ని సంక్షేమ పథకాలు అందించడం కోసం సచివాలయాలు ఏర్పాటు చేసి, లక్షా ముప్పై వేల మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఫొటోగ్రాఫర్ బాబులుకు గ్లోబల్ మాస్ట్రో సర్టిఫికెట్



రాజమహేంద్రవరం సిటీ: నగరానికి చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ మునిని వెంకటేశ్వరరావు (బాబులు)కు గ్లోబల్ మాస్ట్రో ఆఫ్ సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ డిస్టింక్షన్-2023 నుంచి ఎక్సలెన్స్ సర్టిఫికెట్ లభించింది. సోమవారం ఈ మేరకు గౌరవ గ్లోబల్ మాస్ట్రో వ్యవస్థాపకుడు, జీవితకాల అధ్యక్షుడు, డిస్టింక్షన్ చైర్మన్ ఎంసీ శేఖర్ నుంచి ఆయన సర్టిఫికెట్ అందుకున్నారు. ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న బాబులు మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. నగరంలో బాబు స్టూడియో అధినేత బాబులు ఎన్నో ఏళ్లుగా ఫొటోగ్రఫీలో రాణిస్తూ, అద్భుతమైన ఫొటోలు తీసి ఆ రంగంలో గుర్తింపు పొందారు.

సహాయ కలెక్టర్‌గా యశ్వంత్ కుమార్‌రెడ్డి



కలెక్టర్ మాధవీలతను కలిసిన సహాయ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి

సీటీఆర్‌ఐ: జిల్లా సహాయ కలెక్టర్‌గా యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 2022 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన సి.యశ్వంత్ కుమార్ రెడ్డి నంద్యాల జిల్లా కలుగొట్లపల్లె గ్రామానికి చెందినవారు. ముస్సోరిలో ఫేజ్-1 శిక్షణ పూర్తయిన తర్వాత జిల్లాలో పరిపాలన పై అవగాహన కల్పించే ఉద్దేశంతో శిక్షణ కోసం సహాయ కలెక్టర్ హోదాలో ఇక్కడకు వచ్చారు.

ఎంటీయూ 7029, 1318 రకాలతో దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: ఖరీఫ్‌లో ఎంటీయూ 7029, ఎంటీయూ 1318 వరి వంగడాలు వేయడం ద్వారా రైతులు మంచి దిగుబడి పొందవచ్చని రాజమహేంద్రవరం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం రాజవోలు గ్రామంలో మండల స్థాయి ప్రీ ఖరీఫ్ అవేర్‌నెస్ కాంపెయిన్ ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఏడీఏ శ్రీనివాసరెడ్డి వరి వంగడాలు, వరిలో వచ్చే పురుగు, తెగుళ్లు, వాటి నివారణ, కలుపు, నీరు, ఎరువుల యాజమాన్య పద్ధతులను తెలిపారు. మండల ఉద్యానశాఖ అధికారి డి.సుధీర్ కుమార్ మాట్లాడుతూ పంట వేసుకునే ముందు మట్టి పరీక్షలు చేయించుకుని, వచ్చిన రిపోర్టు ఆధారంగా ఎరువులు మోతాదు వేసుకుంటే మంచి దిగుబడి వస్తుందన్నారు. రైతులు పంట నమోదు తప్పని సరిగా చేసుకుని దానికి తగిన రాయితీలు పొందవచ్చన్నారు. సూక్ష్మ బిందు సేద్యం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు డ్రిప్ 90 శాతం రాయితీ, ఇతరులు 50 శాతం రాయితీ పొందవచ్చన్నారు. రైతులు ముందుగా ఆర్‌బీకే సిబ్బంది ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అనువుగా ఉన్న పొలాల్లో ఆయిల్ పామ్, కొబ్బరి వంటి బహు వార్షిక పంటలు వేసుకుని, విస్తీర్ణ పథకంలో భాగంగా రాయితీ పొందవచ్చని ఉద్యానశాఖాధికారి సుధీర్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో సునీల్, వీఏఏ, వీహెచ్ఏ, రైతులు పాల్గొన్నారు.

వేసవి శిబిరం.. చదువుల సమయం

- ఉత్సాహంగా శిక్షణ శిబిరాలు
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



శిబిరంలో విద్యార్థులు తయారు చేసిన కృత్యాలను పరిశీలిస్తున్న డీఐ దిలీప్‌కుమార్

కంబాలచెరువు: వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. పుస్తక పఠనం, పలు రకాల పోటీలు, డ్రాయింగ్, క్రాఫ్ట్స్ వంటి వాటిలో శిక్షణ పొందుతున్నారు. ఈ మేరకు విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరాలకు గ్రంథాలయాలు వేదికలు అవుతున్నాయి. వేసవి శిబిరానికి వస్తున్న విద్యార్థులకు ఆయా అంశాల్లో శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల నుంచి ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా హాజరవుతున్నారు. వియ్ లవ్ రీడింగ్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఈ శిబిరాలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరవుతున్నారు. చిత్రలేఖనం, పేపరు బొమ్మల తయారీ, యోగా తరగతులు, పద్యాలు, కథలు చదవడం పిల్లలకు నేర్పుతున్నారు.

ప్రోత్సాహక బహుతులు : రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 86 స్కూళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 16,234 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. రూరల్ పరిధిలోని 59 స్కూళ్లలో సుమారు 11 వేల మంది చదువుతున్నారు. అయితే వీరందరూ సమ్మర్ క్యాంప్‌లను పూర్తిగా వినియోగించుకోవడం లేదు. ఉత్సాహం, పట్టుదల ఉన్న వారు మాత్రమే హాజరై మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఆయా స్కూళ్ల పరిధిలోని గ్రంథాలయాలకు విద్యార్థులు వెళ్లి కృత్యాలు చేసేలా స్థానిక విద్యాశాఖాధికారులు ప్రణాళిక రూపొందించారు. సమ్మర్ క్యాంప్ అనంతరం హాజరైన విద్యార్థులందరికీ ప్రోత్సాహక బహుమతులు, ధ్రువపత్రాలు అందించనున్నారు.

పర్యవేక్షిస్తున్నాం

వేసవి సెలవుల్లో విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టే విధంగా ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలను పర్యవేక్షిస్తున్నాం. ఇక్కడ విద్యార్థులు నేర్చుకుంటున్న అంశాలను అడిగి తెలుసుకుంటున్నాం. దీనివల్ల వారిలో నైపుణ్యం పెరుగుతోంది. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులందరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి.

– బి.దిలీప్‌కుమార్, అర్బన్ రేంజ్ స్కూల్స్, రాజమహేంద్రవరం

వలంటీర్లు సంక్షేమ సారథులు

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- బొమ్మూరు, రాజవోలు వలంటీర్లకు పురస్కారాల ప్రదానం



వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: వలంటీర్లు ప్రతి కుటుంబానికి సంక్షేమ సారథులుగా సేవలందిస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. బొమ్మూరులోని నరసింహరాజు కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. బొమ్మూరు, రాజవోలు సచివాలయాల వలంటీర్లు 100 మందికి పురస్కారాలను చందన నాగేశ్వర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్లకు సముచిత గౌరవం లభిస్తోందన్నారు. నాలుగేళ్లలో వలంటీర్లు అందిస్తున్న సేవలను గుర్తించి, వారి కోసం ప్రభుత్వం రూ.800 కోట్లు ఖర్చుచేసిందని వెల్లడించారు. వర్షం పడినా, సెలవు అయినా, పండుగైనా ఒకటోతేదీ ఉదయాన్నే తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, పార్టీ నాయకులు యెనుముల త్యాగరాజు, దాకే శ్రీనివాస్, ఎలుగొండ లక్ష్మి, మత్సేటి శివ, పెయ్యల రాజేష్ మాట్లాడారు. అనంతరం వలంటీర్లకు శాలువా, సర్టిఫికెట్, బ్యాడ్జితో సేవా మిత్ర పురస్కారాలను చందన నాగేశ్వర్, పార్టీ నాయకులు అందించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు ఎస్.శ్రీనివాసరెడ్డి, జి.కాశీ విశ్వనాథ్, మాజీ ఎంపీటీసీ నక్కా శ్యాంబాబు, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ జిల్లా చైర్మన్ ముత్యాల పోసికుమార్, పార్టీ నాయకులు సోమన శ్రీనివాస్, కేవీ సుబ్బారెడ్డి, తోడేటి రాజా, కోటిపల్లి రవి, బీదం రాజు, సచివాలయ ఉద్యోగులు, కన్వీనర్లు పాల్గొన్నారు.



వలంటీర్లను సత్కరిస్తున్న కుక్కా తాతబ్బాయి

సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు చేరవేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి, 5వ డివిజన్ ఇన్‌చార్జి కుక్కా తాతబ్బాయి అన్నారు. జాంపేట యాదవుల వీధిలోని 10వ సచివాలయంలో, కంబాలపేట 9వ సచివాలయంలో సోమవారం 26 మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఎం.సుజ్ఞానమణి, వార్డు కన్వీనర్ కాాదా గోపాలకృష్ణ, గంట్ల వెంకన్న, పోతుమూడి పెదబాబు, ముచ్చికర్ల గోవిందరాజు, పట్నాల వీరబాబు, సచివాలయం అడ్మిన్ కె.సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో విత్తనాలు సిద్ధం

కడియం: రైతులకు అవసరమైన విత్తనాలు ఆర్బీకేల్లో సిద్ధంగా ఉన్నాయని ఏడీఏ శ్రీనివాసులురెడ్డి అన్నారు. స్థానిక ఆర్బీకే వద్ద సోమవారం రైతులకు సాగు సమాయత్తంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏడీఏ మాట్లాడుతూ కాలువలకు జూన్ మొదటి వారంలోనే నీటిని విడుదల చేయనున్నారని, ఈ నేపథ్యంలో ఆకుమడులను సిద్ధం చేసుకోవాలని కోరారు. ఏవో ద్వారకాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు రైతులు మాట్లాడుతూ ఆవలో డ్రైనేజీ సమస్యను వివరించారు. ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

దుకాణాల మూసివేత

కడియం: కడియపులంక గ్రామ సర్పంచ్ మార్గాని అమ్మాణి మృతికి సంతాప సూచకంగా గ్రామంలోని దుకాణాలను సోమవారం మూసివేసి, స్వచ్ఛందంగా బంద్ పాటించారు. అమ్మాణి అంత్యక్రియలు కడియపులంకలోని కైలాసభూమిలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో నిర్వహించారు. కాగా.. మరణ వార్త తెలిసిన వెంటనే మండలంలోని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించారు. భర్త ఏడుకొండలు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అమ్మాణి మృతికి జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

రెండో విడత శిక్షణ ప్రారంభం

కంబాలచెరువు: డీఎస్సీ 1998, 2018 ఉపాధ్యాయులకు రెండవ విడత ఇండక్షన్ ట్రైనింగ్ సోమవారం స్థానిక ట్రైనింగ్ కాలేజీలో ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఈ శిక్షణను సక్రమంగా వినియోగించుకుని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలన్నారు. లెక్చరర్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం, డైట్ లెక్చరర్లు సూర్యనారాయణ, సత్యనారాయణ, కళావతి, జానకీదేవి, చూడామణి, ఏఎంఓ గౌరీశంకరరావు పాల్గొన్నారు.

వసతి గృహం సందర్శన

కంబాలచెరువు: కంబాలచెరువు వద్దఉన్న నిరాశ్రయుల రాత్రి వసతి గృహాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి కె.ప్రత్యూష కుమారి సోమవారం పరిశీలించారు. వసతి గృహంలో ఉన్నవారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత, భవన మరమ్మత్తుల విషయంలో అశ్రద్ధ చేయవద్దని వసతిగృహ సిబ్బందికి తెలిపారు.

టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర రాజకీయాలను మలుపుతిప్పేలా మహానాడు సభ జరగనుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. సోమవారం స్థానిక జేఎన్ రోడ్డులోని చెరుకూరి గార్డెన్స్‌లో ఆయన అధ్యక్షతన రూరల్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాల రాయుడు, కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, రూరల్ మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ మాట్లాడారు. అనంతరం వివిధ కమిటీలలో పదవులు పొందిన నాయకులు ప్రమాణ స్వీకారం చేశారు.

జాతీయ బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలిగా డాక్టర్ పద్మలత



డాక్టర్ పద్మలతకు నియామక పత్రం అందజేస్తున్న కృష్ణయ్య

రాజమహేంద్రవరం సిటీ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలిగా నగరానికి వైఎస్సార్ సీపీ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ డాక్టర్ అనుసూరి పద్మలత నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. కృష్ణయ్య మాట్లాడుతూ డాక్టర్ అనుసూరి పద్మలత సమాజ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారన్నారు. ఢిల్లీ ఉద్యమంలోనూ ఆమె గళం వినిపించాలనే ఉద్దేశంతో జాతీయ స్థాయిలో మహిళా అధ్యక్ష పదవి అప్పగించామన్నారు. పార్లమెంటులో బీసీ బిల్లు, మహిళా బిల్లు ప్రవేశపెట్టి బీసీ మహిళలకు సబ్ కోటా తప్పనిసరిగా కల్పిస్తే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. డాక్టర్ అనుసూరి పద్మలత మాట్లాడుతూ మహిళలు విద్య, వ్యాపార, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన సెగలు

- వేమగిరిలో దిష్టిబొమ్మ దహనం
- పాల్గొన్న చందన నాగేశ్వర్, ఇళ్ల లబ్ధిదారులు



చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న చందన నాగేశ్వర్ తదితరులు

కడియం: పేదవారి సొంతింటి కోసం ప్రభుత్వం ఇస్తున్న సెంటు భూమిపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన అనుచిత వాఖ్యలకు వ్యతిరేకంగా కడియం మండలం వేమగిరి వద్ద వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం నిరసన తెలిపారు. జాతీయ రహదారిపై వేమగిరి వద్ద జగనన్న ఇళ్ల లబ్దిదారులు, పార్టీ నాయకులు మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ చంద్రబాబు అసంపూర్తిగా నిర్మించిన టిడ్కో ఇళ్లు కంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇస్తున్న ఇళ్లు పెద్దవన్నారు. కనీసం ఈ విషయంపై కూడా అవగాహన లేకుండా చంద్రబాబు మాట్లాడడం దారుణమన్నారు. రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యదర్శులు గిరజాల వీర్రాజు, మింది నాగేంద్ర, పార్టీ మండల అధ్యక్షులు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, జేసీఎస్ చైర్మన్ తాడాల చక్రవర్తి పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి

ప్రకాశం నగర్: విద్యార్థులు వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ డీఈఓ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ సూచించారు. సోమవారం దానవాయిపేట మహిళా గ్రంథాలయం, శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న శిబిరాన్ని సందర్శించారు. విద్యార్థులు వేసిన డ్రాయింగ్ షీట్లు, పేపర్ క్రాఫ్ట్ బొమ్మలను పరిశీలించారు. మహిళా గ్రంథాలయం లైబ్రేరియన్ అబ్బిరెడ్డి చంద్రపద్మాదేవి, శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ పి.పవన్ కుమార్, ఎం.సూర్యనారాయణ, ఐ.వినోద్ కుమార్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

కడియం: పుస్తక పఠనం విజ్ఞానాన్ని పెంచుతుందని లైబ్రేరియన్ శ్రీదేవి నిర్మల అన్నారు. స్థానిక లైబ్రరీలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బాల సాహిత్యం, వ్యాకరణం, జనరల్ నాలెడ్జి, ఇంగ్లిషు గ్రామర్, ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రాముఖ్యతలను విద్యార్థులకు వివరించారు.

వేసవి శిక్షణ తరగతులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేటశాఖ గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడం, హ్యాండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్, తెలుగు పద్యాలు, లలిత సంగీతం, కోలాటం తరగతులు నిర్వహించారు. కర్ణాటక సంగీతం ఉపాధ్యాయురాలు కారుమూరి వీర రత్నకుమారి మాట్లాడుతూ పాట మనిషికి ఆనందం కలిగించి, ఉల్లాసంగా ఉండడానికి ఉపయోగపడుతుందన్నారు. ట్రస్ట్ సభ్యులు గేదెల వెంకటేశ్వరరావు విద్యార్థులకు మజ్జిగ, సత్య ఎలక్ట్రికల్స్ అధినేత శిఖాకొల్లు సూర్యమాణిక్యం బిస్కట్లు అందించారు.

సచివాలయ భవనం ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు గ్రామంలోని సచివాలయం-2 భవనాన్ని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.40 లక్షలతో అన్ని వసతులతో భవనం నిర్మించారన్నారు. మాజీ ఎంపీటీసీ నక్కా శ్యాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెయ్యల రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, మట్టా వీర్రాజు, మోర్తా వీర్రాజు, ఎస్.రమణ, పంచాయతీ కార్యదర్శి జి.కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల : అన్ని మంచి శకునములే
సూర్యమినీ : గార్డియన్స్ ఆఫ్ దిగెలాక్సీ
సూర్యప్యాలెస్ : ఫాస్ట్‌అండ్‌ఫ్యూరియస్10
స్వామి : బిచ్చగాడు-2
శివజ్యోతి : కస్టడీ
అనుశ్రీ : విరూపాక్ష
రాజా : ఫాస్ట్‌అండ్‌ఫ్యూరియస్10
అశోక : ఉగ్రం
ఊర్వశి : సింహాద్రి
రంభ : దికేరళస్టోరీ
మేనక : రామబాణం
అప్సర : ఫాస్ట్‌అండ్‌ఫ్యూరియస్10

నామవరం
వీఎస్ మహల్ : బిచ్చగాడు-2

ధవళేశ్వరం
మురళీకృష్ణ : ఫాస్ట్‌అండ్‌ఫ్యూరీయస్-10

కడియం
వెంకటసూర్య : బిచ్చగాడు-2

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కంబాలచెరువు: స్థానిక ఆల్‌కట్ గార్డెన్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి (36) సోమవారం రాత్రి మృతి చెందాడు. అతడిని గమనించిన స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలిపారు. వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. కానీ ఏ ఆధారాలు దొరకలేదు. అయితే అతడు అతిగా మద్యం తాగవడం వల్ల చనిపోయాడని పోలీసులు చెబుతున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. రెండో పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో లారీ దగ్ధం



దగ్ధమవుతున్న లారీ

సీతానగరం: షార్ట్ సర్క్యూట్‌తో ఓ లారీ దగ్ధమైంది. పోలవరం ప్రాజెక్ట్ పనులకు పురుషోత్తపట్నంలోని గోదావరి పరీవాహక ప్రాంతం నుంచి లారీలపై ఇసుక తీసుకువెళ్తున్నారు. ఇదేవిధంగా సోమవారం ఉదయం పురుషోత్తపట్నం నుంచి ఇసుక తరలిస్తున్న లారీ బయలుదేరింది. పోలవరం కాఫర్ డ్యామ్ వద్దకు చేరేసరికి ఆ లారీ క్యాబిన్ నుంచి పొగలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమై, లారీ నుంచి సురక్షితంగా బయట పడ్డాడు. ఆర్పడానికి ప్రయత్నించినా ఆ లారీ మంటల్లో పూర్తిగా దగ్ధమైంది.

జీవ వైవిధ్యం కాపాడుకోవడం అందరి బాధ్యత

కడియం: జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంఈవో వి.లజపతిరాయ్ అన్నారు. ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవాన్ని సోమవారం స్థానిక హైస్కూల్లో హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవ వైవిధ్య చట్టం, జీవ వైవిధ్య పరిరక్షణ, ఆవశ్యకతలను వివరించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, మొక్కలను నాటాలన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు జి.సత్యనారాయణ మాట్లాడుతూ భూగోళం మీద అన్ని జీవులకు జీవించే హక్కు ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు.

శరత్‌బాబు మృతి తీరని లోటు



జిత్‌మోహన్‌మిత్ర

సీటీఆర్‌ఐ: నటుడు, క్యారెక్టర్ ఆర్టిస్టు శరత్‌బాబు మృతి సినిమా రంగానికి తీరని లోటు అని సీనియర్ నటుడు శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర అన్నారు. కె.విశ్వనాథ్ చిత్రాల్లో శరత్‌బాబుకు మంచి పాత్రలు వచ్చేవని, ఆయనతో కలిసి తాను పలు సినిమాల్లో నటించానన్నారు. సితార, మూడు ముళ్ల బంధం, శిక్ష తదితర చిత్రాలు ఇక్కడే నిర్మించారన్నారు. కె.విశ్వనాథ్ దర్శకత్వంలో సర్వమంగళ అనే టీవీ సీరియల్ షూటింగ్ నగరంలోనే జరిగిందని తెలిపారు. వాటిల్లో శరత్‌బాబు కలిసి నటించే అవకాశం దక్కిందన్నారు. శరత్‌బాబు షాట్ పూర్తయితే పుస్తకాలు చదివేవారని, గోదావరి అందాలకు ముగ్ధుడైయ్యేవారన్నారు.